

# దేవదూత

దాసరి సుబ్రహ్మణ్యం

గురువు యిహలోకయాత్ర చాలించిన మరు నిముసాన బ్రహ్మయ్యకు దివ్యజ్ఞానం కలిగినట్టయింది. కొద్దిసేపట్లో ఆయన తన ఆత్మని పరమాత్మలో లీనంచేస్తాడనగా బ్రహ్మయ్యను దగ్గరకి పిల్చాడు.

'గురుపీఠం కట్టబెట్టపోతున్నాడు.'

'నాకంటే గురువుగారికి ఎక్కువ శుశ్రూష చేయలేదు. పైగా నాకన్న రెండేళ్ళు వెనక వచ్చాడు.'

చుట్టూ మూగిన శిష్యబృందం గుసగుసల్తో చెవులు కొరుక్కున్నారు. వాళ్ళహృదయాల్లో బాధా,బ్రహ్మయ్యమీద యీర్ష్యా భగభగమన్నవి.

గురువుగారి పక్కనుంచిలేచి యివతలకు వచ్చి బ్రహ్మయ్య తల బాగా వెనక్కుపెట్టి, ఆకాశం వంక చూశాడు. ఊర్ధ్వలోకాన్నుంచి దివ్యతేజస్సు తనలోకి తరంగితమైనట్టు అతనికి తోచింది- ఏవో దివ్యవాక్కులు—

వారంరోజులకల్లా స్వగ్రామం వచ్చివాలాడు. సూర్యోదయం అవుతూవుండగానే చెరువుగట్టున, రావిచెట్టుకింద కూర్చున్నాడు. ఊరెంతగా మారి పోయింది?

యాభైయేళ్ళనాడు తను గ్రామాన్ని వదిలి, భగవదన్వేషణకు హిమాలయాలకు ప్రయాణంకట్టినప్పటికీ యిప్పటికీ, హస్తిమశకాంతరం అంత మార్పు—

ఈశ్వరసందేశాన్ని తన గ్రామంనుంచే ప్రారంభించాలి. ముందుగా తన భార్య—ఛీ! యింకా తనకు యీ ఐహికసంబంధాలమీద మమకారం వదలలేదనుకున్నాడు. శరీరం దివ్యతేజస్రవంతిలో మునకలుతీస్తూండగా, హృదయం ఆ పరంజ్యోతి మధురభావనలతో వుబ్బితబ్బిబ్బౌతూండగా— యింకా యీ తుచ్ఛయిహలోక బాధాలూ— కామ్యాలూ తమ దుష్టప్రభావాన్ని తనమీద ప్రయోగించటమా?

శరీరాన్నీ, ఆత్మనీ కదలకుండా తొక్కిపట్టి వుంచేందుకు తన గురువుగారి సాధనమైన జ్ఞానపత్రి బయటకుతీసి, చిలుములోకి ఎక్కించాడు.

చెరువుకు నీళ్ళకై అప్పుడేవచ్చిన నలుగురైదుగురు స్త్రీలు అతణ్ణిచూసి ఏమో చెప్పుకున్నారు. అందులో ఒక అరవైసంవత్సరాల వృద్ధముత్తయిదువ—

'ఎగతాళిచేయకండమ్మా! యిలాంటి సన్యాసుల్లోనే కొందరు మహాయోగులుంటారు' అన్నది.

ఆమాటలు బ్రహ్మయ్య చెవినిపడినై. తన మహాయోగిత్వం, తను చెప్పకండానే మానవులు గుర్తి

స్తున్నారు. 'గురుదేవా! నీదయ - ఈశ్వరా! నీ రక్షాబంధం-!' అనుకున్నాడు.

గంజాయిదమ్ము లాగి రెండు గుక్కలు పీల్చాడు. ఉఫ్ అని పొగను పైకివూదుతూ అలా ఆకాశంవంక చూశాడు. గుబురుగా వున్న రావిచెట్టుఆకుల సందుల్లోంచి, ఆకాశం ముక్కలు ముక్కలుగా కనబడుతోంది. అనిర్వచనీయమైన ఏదో వెలుగు పైనుంచి తనమీదకు ప్రసరిస్తో—

'దివ్యసత్యాన్ని యీ మూఢమానవులకు బోధించు!' అంటోంది. అతడు మూడోసారి చిలుమును బాగాకుదిపి పట్టినపట్టుతో—యోగ నిద్రలోకి జారుకున్నాడు.

'ఏయ్ సన్యాసీ! మునసబుగారి దగ్గిరకిరా. నీకు గంజాయి ఎలావచ్చిందో చెబుదువుగాని.'

గట్టిగా తన కుడికాలికి తగిలేట్టుగా ఎవరో కర్రతో కొట్టారు. యోగ సమాధిలో, జీవ బ్రహ్మైక్యాన్ని పొంది, చేతనా రహిత స్థితిలో వున్న బ్రహ్మయ్యకు, యిహలోక కింకరుడు - మోతాదు రామస్వామి కర్రదెబ్బ ఆనలేదు.

నీళ్లు ముంచుకొని, గట్టు పైకి వచ్చిన ఆడవాళ్లు యీ దృశ్యాన్ని వింతగాచూస్తూ నిలబడ్డారు. మోతాదు రామస్వామికి ఒళ్లు కంపరమెత్తింది. తనమాటకే గడగడలాడవలసిన సన్యాసి — కర్ర దెబ్బకూడా లెక్క చేయకపోవడం అతడికి చిరాకు కలిగించింది.

'ఓరి సన్నాసోడా! దొంగేసంపూని, మునసబుగారి దగ్గిరకి పద.'

ఈసారి మాటా, కర్రపోటూకూడా, కొంచెం పెద్ద మోతాదులో వుపయోగించాడు.

'ఓం!' బ్రహ్మయ్య కళ్లు తెరిచాడు—ఎదురుగా, జానెడు పొడుగు చుట్ట నోట్లో పెట్టుకొని వూస్తూ, మోతాదు నిలబడివున్నాడు - ఊర్ధ్వ ముఖమైన తన మనస్సుని - అధోముఖం చేసిన కర్రపోటు, ఆ వ్యక్తినుంచే వచ్చిందని గ్రహించాడు. ఎడమ చేత్తో గడ్డాన్ని గట్టిగా దులిపి, శాపం యివ్వబోయే వాడిలా ముఖంపెట్టి, కుడి చెయ్యి పైకెత్తాడు.

మోతాదు వెనక్కి అడుగు వేయలేదు. చలించలేదు.

బ్రహ్మయ్య నఖశిఖపర్యంతం వూగిపోయాడు. భగవత్ సందేశాన్ని-భగవంతుడి నోటినుంచి విని—దాని ప్రచారానికి బయలుదేరిన తనను యీ అల్ప మానవుడు లెక్క చేయక పోవడమా? మనస్సుని అంతర్లీనం చేసుకుని, కారణం కనుక్కోవాలనుకున్నాడు. సంచిలో చేయిపెట్టి ఒక గుప్పెడు గంజాయి బయటకు లాగాడు.

'అరె దొంగ సన్యాసీ! అంతగంజాయే! పద మునసబుగారి దగ్గరకి.'

మోతాదు అమాంతంగా బ్రహ్మయ్య చెయ్యి పట్టుకున్నాడు.

చేతిని అతడి పట్టునుంచి విడిపించుకోవడానికి బ్రహ్మయ్య ఏ మాత్రం ప్రయత్నం చెయ్యలేదు. నిశ్చలంగా, తలకొంచెం పైకెత్తి మోతాదు కళ్ళల్లోకి తీక్షణంగా చూశాడు.

ఆ చూపుతో అతడు మంచులా కరిగి, నీకై రక్షించమని తన పాదాలు పట్టుకుంటాడని అతడి ఆశ. ఈశ్వరాజ్ఞను జగత్తంతా మారుమ్రోగించడానికి బయలుదేరిన తనను యీ తుచ్ఛమానవ మాత్రుడా అటకాయించేది!

'లేరా! లే! ఏంటా దొంగచూపు?' రామస్వామి గట్టిగా చేతిని గుంజాడు. బ్రహ్మయ్యకు హిమాలయం విరిగి మీదపడినట్టయింది. తను తలచిన దానికి వ్యతిరేకఫలితం! బహుశా దేవుడు తనని అగ్ని పరీక్షకి గురిచేస్తున్నాడా?

'ఇంత గంజాయి నీకు ఎక్కడనుంచి వచ్చిందో చెప్పు?'

సంచీలో చేయిపెట్టి రామస్వామి గుప్పెడు గంజాయి బైటకులాగి ప్రశ్నించాడు.

'అది గంజాయి కాదు. జ్ఞానపత్రి—'

'గంజాయి కాదు గేనపత్రి! నీవు సన్నాసివి కాదు చంకరుడివి! లే! దొంగ సన్నాసోడా!' రామస్వామి ఎడమకాలుతో బ్రహ్మయ్య బుజాన గట్టిగా తన్నాడు.

బ్రహ్మయ్య తాచులాగా 'రక్' మని లేచి నుంచున్నాడు.

చుట్టూ అప్పటికే మూగిన ఆడవాళ్ళు కాక, మరో యిద్దరు మగవాళ్ళు చేరారు.

'నిషేధం వుందని తెలియదటమ్మా? అంత గంజాయి సంచీలో పెట్టావ్.'

చుట్టూచేరిన వాళ్ళల్లోనుంచి ఒకరు ప్రశ్నించారు.

జ్ఞానపత్రికి నిషేధమా? ఎవడా నిషేధం పెట్టింది?' బ్రహ్మయ్య గుడ్లెర్రచేసి అక్కడచేరిన అందరినీ ప్రశ్నించాడు.

'మునసబుగారే చెపుతారు రా! ఊc!' మోతాదు రామస్వామి మళ్ళీ చెయ్యిపట్టుకున్నాడు.

బ్రహ్మయ్య శరీరం గజగజలాడింది. ఆత్మ గిజగిజ కొట్టుకొన్నది. తను ప్రచారం చేయడానికి వచ్చిన దివ్యసందేశం-కాని యిప్పటి తనస్థితి. ఉష్! అనుకున్నాడు.

'పోవయ్యా! ఫో! కేసులేకండా వదిలేస్తాడు. సన్యాసులంటే మునసబు సుబ్బయ్యగారికి కోపం, జాలీకూడా.' ఎంతో దయగా జనంలోనుంచి ఒకరు సలహా యిచ్చారు.

మునసబు సుబ్బయ్య ఎవరు? బ్రహ్మయ్య తన మనస్సును యాభైసంవత్సరాల వెనక్కి పోనిచ్చాడు. తన పెళ్ళి—ఆనాటి ముచ్చట్లూ, తన బావ మునసబు రత్తయ్య...బహుశా యితడు తన మేనల్లుడు సుబ్బయ్యే అయివుంటాడు. తన పెళ్ళి నాటికి నాలుగైదేళ్ళ కుర్రవాడు.

'మునసబు నా మేనల్లుడే! వాణ్ణే యిక్కడకు రమ్మను.' తనకు తెలియకండానే-యాభైసంవత్సరాల పాతచరిత్రని తిరగవేసిన మనస్సు, యీ మాటని బయటకు గిరవాటువేసింది. 'ఈశ్వరా! నీదివ్య సందేశప్రచారానికి నేను తగను! తగను!' అనుకుంటూ బ్రహ్మయ్య ఒక్కసారిగా చతికిలబడ్డాడు. అదే సమయంలో అక్కడచేరిన స్త్రీలలో ఒకామె చేతిలోనుంచి బిందెజారి కిందపడింది.

'నా దేవుడా! ఎన్నాళ్ళకు తిరిగివచ్చావ్! నేను లక్ష్మమ్మని! లక్ష్మమ్మని!' ఆమె బోర్లాపడి బ్రహ్మయ్య రెండుకాళ్లూ పట్టుకున్నది.

కళ్లు మూసేవుంచి బ్రహ్మయ్య ఆలోచించాడు. ఎవరీ లక్ష్మమ్మ? తన మేనకోడలు! భార్య! 'తిరిగి ఐహికబంధాల్లోకి తోసేస్తున్నావా ఈశ్వరా!' అనుకుంటూ కళ్లు తెరిచాడు.

'మీ కుడిచేతికి వున్న ఆరో వేలూ, బుగ్గనవున్న మచ్చా చూడగానే-మీరే అనుకున్నా. కాని సుబ్బయ్య నా మేనల్లుడే అనేవరకు నేను ధైర్యం చేయలేకపోయా. ఏడీ! ఆ మోతాదు రామస్వామిగాడు? మిమ్మల్ని తన్నుకూడా తన్నాడు. తమ్ముడితో చెప్పి డొక్క చీల్పిస్తా!'

బ్రహ్మయ్య నిర్వికారంగా ఆమెవంక చూస్తున్నాడు. జనం మోతాదు రామస్వామికోసం చుట్టూ చూశారు. అతడప్పటికప్పుడే కర్రా, తలగుడ్డా అక్కడే పారవేసుకుని వూళ్లోకి పరిగెత్తుతున్నాడు

ఎక్కువ శ్రమపడకుండానే బ్రహ్మయ్యని, మునసబు సుబ్బయ్య, యింటికి తీసుకువెళ్ళాడు. ఎంత చెప్పినా మంచంమీద కూర్చొనటానికి మాత్రం బ్రహ్మయ్య అంగీకరించలేదు. లక్ష్మమ్మ తలుపు పట్టుకొని ఎడంగా నిలబడింది. గొంతు సవరించుకొని, సుబ్బయ్య అక్క లక్ష్మమ్మవంక వొకసారి సాభిప్రాయంగా చూసి—

'అయితే మామయ్యా! ఇన్నాళ్లనుంచీ ఎక్కడున్నావ్?' అన్నాడు.

'హిమాలయాల్లో యోగీశ్వరుల మధ్య' బ్రహ్మయ్య తలవంచుకునే జవాబిచ్చాడు.

'ఇంతవయసు మళ్ళిన తరవాతవచ్చే దానికంటే-యిదివరకే వస్తే ఎంత బావుండేది.'

బ్రహ్మయ్య తలపైకెత్తి మేనల్లుడివంక వెగటుగా చూశాడు. ఐహికబంధాల్లో చిక్కుకుని సతమతమయ్యే యీ అల్పమానవులకి, తన దివ్యత్వం, తను ఎప్పుడూ చూస్తూండే దివ్యతేజస్సూ, అందులోని నిత్యానందం, ఏమర్థమవుతై!

'అయ్య చచ్చిపోయాడు. పదిహేనేళ్ళనుంచి నేనే మునసబుగిరీ చేస్తున్నాను.'

'మంచిది! మంచిది! అవన్నీ నాకనవసరం. నేను ఈశ్వరాజ్ఞ ననుసరించి- ఆయన దివ్యసందేశాన్ని ప్రచారంచేయడానికి వచ్చాను. మీ గృహ విషయాలు నాకు చెప్పొద్దు' బ్రహ్మయ్య మళ్ళీ తలవంచుకున్నాడు. అక్కాతమ్ముళ్లు వొకరి ముఖం వొకరు ప్రశ్నార్థకంగా చూసుకున్నారు. లక్ష్మమ్మముఖాన విషాదచ్ఛాయలు అలముకున్నై. సుబ్బయ్య పెదిమలచాటున నవ్వుకున్నాడు.

'అయితే! ఆ ఈశ్వరసందేశాన్ని నాతోనే ప్రారంభించు.' సుబ్బయ్య తన రెండుచేతుల్నీ వోసిలిగాపెట్టి బ్రహ్మయ్యవైపు జరిగాడు.

'ఈ ప్రపంచం మిథ్య! ఈశ్వరుడే సత్యం!'

సుబ్బయ్య, యిల్లు అదిరిపోయేట్టుగా నవ్వాడు. మరికొంచెం బ్రహ్మయ్యప్రక్కకు జరుగుతూ— 'యింతేనా నీవు తెలుసుకున్న సత్యం. ఇంకేమైనా వుందా?' అన్నాడు.

'ఇంతే! యిది నేను తెలుసుకున్నదికాదు. మా గురుదేవుడు శరీరం చాలిస్తూ నాకు చెప్పిన దివ్య మంత్ర ప్రభావంవలన, ఆ ఈశ్వరుడే నాకు స్వయంగా చెప్పాడు—ఆజ్ఞాపించాడు.'

'బాగానేవుంది, కాని, ఈశ్వరుడు చెప్పాడనే ఆ రెండుముక్కల్లో నీవేమీ కార్యం సాధించలేవు. అయినా నీసొంతం ఏమైనాచెప్పగలవేమో చెప్పు.'

బ్రహ్మయ్యరెండు నిమిషాలు మౌనంగా వూరుకున్నాడు. తల యెత్తి లక్ష్మమ్మవైపు ఓమారు చూసి—

'అయితే నేనుచెప్పింది, అబద్ధమునా మీ వుద్దేశ్యం' అన్నాడు.

'అబద్ధం అనికాదు. ఆ రెండుముక్కల్తో ఈశ్వరకార్యం సాధింపబడజాలదనీ— బహుశా అతడు తనమాతను ఎన్నుకోవడంలో పొరబడ్డాడేమో అని నావుద్దేశ్యం.'

బ్రహ్మయ్య విసుగ్గా తల అటూ యిటూ వూపాడు. లక్ష్మమ్మ కొంత తెప్పరిల్లింది. సుబ్బయ్య మామ వాలకాన్ని అతిజాగ్రత్తగా కనిపెడుతున్నాడు.

'నీవేదో తాళ్యంగా మాట్లాడుతున్నావ్; ఆ రకమైన పోకడలన్నీ నాకు తెలియవు. అసలు నీ భావమేమిటో సరిగ్గా, సూటిగా చెప్పు.'

సుబ్బయ్య గట్టిగా దగ్గి గొంతు సవరించుకున్నాడు.

'అయితే విను, నీవు గడచిన యాభైయేళ్ళనుంచీ యీ ప్రపంచంతో సంబంధం లేకుండాపోయింది. ఇక్కడ ఎన్నోమార్పులు జరిగినై. అసలు దేవుడు లేడనే వేదాంతులదగ్గిరనుంచీ- నేనే దేవుణ్ణనే వేదాంతులవరకూ బయలుదేరారు...'

'అయితే ఒకమాట. అలా దేవుడులేడనే వేదాంతుల్ని నాశనంచేయడానికే. ఈశ్వరుడు నాకు అలాంటి సందేశం యిచ్చాడు.'

బ్రహ్మయ్యకు, తిరిగి తనలో ఏదో జ్యోతి వెలిగినట్టయింది. లక్ష్మమ్మ ఎదురుగా లేకండా పోతే? ఏమైనాసరే ఆమెవంక చూడకూడదనుకున్నాడు. గురువు చెప్పిన మంత్రం మననంచేయ ప్రారంభించాడు.

'మామయ్యా! ఇటు చూడు. నీవు ఏదో ఆలోచిస్తున్నట్టుంది. భోజనానికి వేళ కూడా అయింది. రెండు మాటల్లో నావుద్దేశ్యం చెబుతాను.'

'హుం! కానీ!' బ్రహ్మయ్య మంత్రం జపిస్తూనే అన్నాడు.

సుబ్బయ్య జేబులోనుంచి సిగరెట్టు తీసి, రెండు సార్లు గట్టిగా పీల్చి ప్రారంభించాడు.

'లోకం చాలా మారిపోయింది. ప్రతి దానికీ మనం పూర్వం అనుకునే అర్థాలకీ, యిప్పటివాటికీ అసలు సంబంధమే లేకుండా పోయింది. అందులో ముఖ్యంగా వేదాంతం.'

'నాది వేదాంతం కాదు. ఒక పరమరహస్యం, నాకళ్ళతో చూసి, చెవుల్తో విన్నది.'

'అదే మాట్లాడబోతున్నాను. రెండు ముక్కల్లో నేను చూసింది యిదీ - విన్నది యిదీ అంటే ప్రజలు నమ్మే స్థితిలోలేరు. నీవు చూసిందీ, విన్నదీ ఎంత స్వల్పమైనా—దానికి నీ సొంతం కొంతచేర్చి కనీసం భారతం అంత గ్రంథాలు ఒక యిరవై అయినా రాయగలిగి వుండాలి. ఇప్పటి వేదాంతుల్లో చాలామంది దిట్టంగా రాయగలిగినవాళ్లూ, మాట్లాడగలిగిన వాళ్ళూ వున్నారు.'

'నాకా శక్తిలేదు. ఏం చేయమంటావ్?'

'అందుకే దేవుడు నిన్ను దూతగా ఎన్నుకోవడంలో పొరబడ్డాడని అన్నది. ఈ రోజుల్లో అంతా తర్కం, హేతువాదం; అసలు దేవుడి విషయం వచ్చే సరికి ప్రతివాడూ ఓ శస్త్రవైద్యుడు, నిలువునా కోసి చూసికూడా నమ్మడు.'

'దైవబలంవల్ల వాళ్ళందరినీ వోడించి వేస్తా' బ్రహ్మయ్య ధీమాగా అన్నాడు.

'ఓడించలేవు మామయ్యా! ఓడించలేవు! నీవు చెప్పే దేవుడిమీది దాడికి వాళ్ళు ఇంగర్ సాల్‌నీ, వాల్టేర్‌నీ, మార్క్సునీ తెచ్చుకుంటారు. ఇక—నీవు చూశానూ, విన్నానూ అన్నదానికి ఫ్రాయిడూ...'

'ఎవరువాళ్ళు? ఎక్కడున్నారు? ఆ దైవద్రోహుల్ని—' బ్రహ్మయ్య వుద్రేకంలో యిక మాట్లాడ లేకపోయాడు. నేత్రాలు నిప్పులు కక్కుతునై. సుబ్బయ్య సావధానంగా ఒకమారు అతడి వంక చూసి—

'ఈ కళ్ళజోడు నేనెందుకు పెట్టుకున్నాననుకున్నావ్?' అన్నాడు.

'ఏమో!'

దీనికూడా చాలా చరిత్రవుంది. నీవు అలా యిల్లు వదిలిపోయి నప్పుడు నేను చాలా కుర్ర వాణ్ణి గదా? నిన్ను గురించి ఏవో కథలు చెప్తూండేవాళ్ళు. నాకు పదిహేనేళ్ళు వచ్చేటప్పటికీ నీవు రోజూ కలలో కనబడుతూండడం, మేలుకొని వున్నప్పుడుకూడా ఏవో దృశ్యాలు, అలా అలా గీట్ల రూపంగా మనషులూ, దేవుళ్లూ కనబడుతూండేవారు. నేను నిజంగా ఏదో ఆనందంలో తన్మయుణ్ణయి పోతూండేవాడిని. చివరికి నావాలకం కనిపెట్టి అయ్య నన్ను కళ్ళవైద్యుడి దగ్గరకు తీసుకుపోతే - ఆయన నాకు ఫోటో ఫోబియా అనేకంటి జబ్బని- ఈ జోడు యిచ్చాడు.'

'నీవేదో గూఢార్థంగా మాట్లాడుతున్నావ్. నా కర్థం కావడ లేదు.'

'అర్థం అయేందు కేమీలేదు. మనిషికి సంభవించే ప్రతి వికారానికీ, వికృతానికీ- వైద్యుడో, మానసికశాస్త్రవేత్తో సరైన అర్థంచెప్పి, చికిత్స చేస్తారు. మళ్లా చెబుతున్నాను మామయ్యా! నీవు యిల్లువదిలిన యాభై యేళ్ళలో లోకం చాలా మారింది.'

'అయితే నేను చూసిందీ - విన్నదీకూడా ఏదో వికారమే నంటావా?'

'నేను అలా అనను. కాని లోకం మాత్రం నీమీద ఫ్రాయిడ్ సిద్ధాంతాన్ని ప్రయోగించి, చికిత్స చెపుతుంది. నీ దివ్య సందేశానికి వాళ్ళు చెప్పబోయే - జవాబు అంతే!'

'ఇంతకీ నీవు చెప్పబోయేది...

'యాభైయేళ్ళ నిండు జీవితాన్ని వృథా పుచ్చావ్! ఇంకొకళ్ళకూడా అదేగతి కలుగ చేశావ్. ఇక ఆ మిగిలిన జీవితాన్నయినా శాంతిలో గడుపు.'

'మరి ఈశ్వరుడు నాపైవేసిన కార్యభారం?'

'ఆయన్నే చూసుకోమను. ఒక్కసారి ఆకాశాన్ని కప్పేటంత రూపంతో, యీ లోకంలోని నాస్తికుల్నీ, ద్రోహుల్నీ చీల్చి చెండాడతానని కనబడి చెప్పమను.'

'ఆయన అలా కనిపించడు. నాద్వారా తన కార్యం నెరవేర్చుకో బోతున్నాడు.'

'ఆయన యింకా చాలామందిద్వారా తన పనులు నెరవేర్చుకున్నాడు. పరస్పర వైరుధ్యంతో కూడిన దేవదూతలు, దేవుళ్ళూ, మచ్చుకు కృష్ణుడూ, క్రీస్తూ, మహమ్మదూ...'

'వాళ్ళంతా ఒకే సత్యాన్ని వివిధరూపాల్లో, మాటల్లో బోధించారు.'

'అది చాలా చౌకబారు జవాబు మామయ్యా? ఏడెనిమిదివందల సంవత్సరాలు వాళ్ళ అనుచరులు ఒకళ్ళగొంతు వొకళ్లు కోసుకున్నారు; యిప్పటికీ కోసుకుంటున్నారు.'

'లోకం చాలా చెడిపోయింది.' బ్రహ్మయ్య నిట్టూర్పు విడిచాడు. సుబ్బయ్య ముఖాన విజయగర్వం తాండవించింది. లక్ష్మమ్మ వంక ఓరగా చూసి——

'అందుకే ఆయన స్వయంగావచ్చి యీపని చూసుకుంటే సరిపోతుంది. ఒక్క ముక్కయినా రాయడం, మాట్లాడడంకూడా చాతకాని నీబోటి వాళ్ళని పట్టుకుని బాధించేకన్న, ఆయనే యీ లోకానికి దిగివచ్చి మరమ్మత్తు చేసుకోవడం వుత్తమం. నిజం చెప్పాలంటే, లోకం చాలా చెడిపోయింది.'

సుబ్బయ్య లేచి నుంచున్నాడు. బ్రహ్మయ్య ఆత్రుతగా అతడివంక చూసి——

'ఇంతకీ తేలింది?' అన్నాడు.

'నీ శేషజీవితాన్ని యింటిపట్టున గడిపేయ్! నీకు ఈశ్వరుడు దివ్యసందేశాన్ని చెప్పేడేగాని, అది విజయవంతం కావడానికి అవసరమైన వాక్ధోరణీ, రచనానైపుణ్యం యివ్వలేదు. అది లేకుండా నీవు ప్రజల్లోకి వెళ్లి ఏమీ చేయలేవు- యీకకు యీకా, తోకకు తోకా లాగుతారు. సరే! లేచి స్నానంచెయ్యి-వుదయం కనబడతా.'

బ్రహ్మయ్య పక్కనవున్న సంచిలో చేయి పెట్టి 'నాజ్ఞానపత్రి ఏదీ' అంటూ తెల్లబోయాడు. సుబ్బయ్య గడపదగ్గిర ఆగి——

'ఈ దుష్టమానవులు దానికి గంజాయి అని పేరుపెట్టి నిషేధించారు. పోలీసువాళ్ళకిగాని తెలిస్తే నీమీద కేసుపెట్టి, కనీసం అయిదునెల్లనాళ్ళ జైలుకు పంపుతారు.'

'అది లేందే నేను బతకలేను. దానిమీద నిషేధం వుందని నాకు తెలీదు.'

'అందుకే నే నన్నది,-ఈశ్వరుడు నిన్ను దూతగా ఎన్నుకొన్నాడేగాని, యీప్రపంచపుపోకడను గురించి ఏమాత్రం చెప్పలేదు. అయిపోయిం

దేహో అయిపోయింది. ఆ అలవాటు కూడాను. మోతాదుచేత మంచి ఘాటైన బ్రేబోలు పుగాకు పంపుతా.'

లక్ష్మమ్మవైపు చేయిచూపి సుబ్బయ్య బైటకు వెళ్లిపోయాడు.

*           *           *

ఆ రాత్రి నడి జామువరకు బ్రహ్మయ్యకు నిద్ర పట్టలేదు. తలుపువంక చూశాడు, బార్లా తీసివుంది. లక్ష్మమ్మ తన మంచం పక్కన చాప వేసుకుని పడుకొనివుంది.

తను యీ యాభైయేళ్ళ యిల్లు వదిలి, సన్యాసుల్లో కలిసి ఏం సాధించినట్టు - శోభనం నాటి ఆ రాత్రి హఠాత్తుగా నడిరేయిన, తనకు యిల్లు వదిలి పోవాలనే బుద్ధి ఎందుకుపుట్టింది ?

లక్ష్మమ్మ వంక ఏదో ఆశగా చూశాడు. ఆనాడు ఆమె ఎంత అందంగా, యౌవనంతో మెరిసి పోతూవుంది. ఆనాడు తనూ......నశించి పోయిన తన జవసత్వాన్నీ, పక్కన నిద్రపోతున్న భార్యనీ, తన యాభైయేళ్ల సన్యాస జీవితాన్నీ, ఈశ్వర సందేశాన్నీ, చివరకు యీ లోకాన్నీ తలుచుకుని వెక్కి-వెక్కి ఏడ్చాడు.

మూరెడు పొడుగు గడ్డాన్నీ, తలగడనీ కన్నీళ్లతో తడిపి - హృదయనైర్మల్యం కోసం, ఆత్మశాంతి కోసం అలవాటు ప్రకారం పక్కన జ్ఞాన పత్రి, చిలుము కోసం చూశాడు. ఆ రెండూ లేవు. సుబ్బయ్య పంపుతానన్న పుగాకూ పంపలేదు.

బ్రహ్మయ్య ఊర్ధ్వముఖుడై కళ్లు తుడుచుకుంటూ, ఆలోచిస్తున్నాడు.

# మా - సి - యాంగ్ భావికార్యక్రమం

చుండి జగన్నాథం

రేపో, ఎల్లుండో మా-సి-యాంగ్ చైనా దేశాన్ని పరిపాలిస్తాడనగానే కొందరికి మతి చెడిపోతున్నది. మరి కొందరికి కంపరమే పుడుతున్నది. ఇతరులకు అనేకులకు ఆసియా ఖండంలోని ఆగ్నేయ దిక్కున రక్తపు నదుల భయంకర దృశ్యాలు కండ్లకు కట్టినట్లున్నవి. ఇవన్నీ అపోహాలు.

ఇంగ్లాండువంటి దేశంలో లేబర్‌పార్టీ, ఇండియావంటి దేశంలో సోషలిస్టుపార్టీ నెరవేర్చవలసిన చారిత్రాత్మక కార్యక్రమాన్ని చైనావంటి దేశంలో కమ్యూనిస్టుపార్టీ అవలంబిస్తున్నది.

మావ్ చేతికి చిక్కిన 'స్వాధీన చైనా' లో ఇన్నాళ్ళూ జరిగినదేమిటి? రైతుకు పొలం సాగు చేసుకోడానికి దొరికింది. రైత్వారీ పద్ధతే అమలులో వుంది. సమష్టి వ్యవసాయప్రయత్నం జరగలేదు. గొప్ప భూస్వాములైన భూ ఖామందుల పొలాల్నీ, జమీందార్ల ఎస్టేట్ భూములను సర్వే చేయించి, ఆయా ఖామందులకు సరిపడ పొలంవుంచి, మిగతాపొలాన్ని జాగ్రత్తగా రైతులకు గ్రామంలో పంచారు. పొలంలేనివాళ్లకు పొలమిచ్చారు. కొంచెంవున్నవాళ్ళకు మరికొంచెం దొరికింది. రైతుల వ్యవసాయపుకూలీల యూనియన్ల ద్వారా పంపకాలు జరిగినవి. వ్యవసాయం కూడా వాటి ప్రోత్సాహంచేతనే విశేషంగా జరుగుతున్నది.

చేతిపరిశ్రమలు వెలసినవి. ప్రతిఇంటా రాట్నచక్రం, గ్రామంలో చేనేత వర్ధిల్లుచున్నవి. అధికాహారోత్పత్తిని ఆఫీసర్లు, సైనికులు (తీరిక వేళ) చేస్తారు మొట్టమొదటగా. జరూరుగా అవసరమైన పంటలు వేసేందుకు సర్కార్ సహాయంవుంటుంది.

చైనా అంతా చేతికి చిక్కినతర్వాత మావ్ పాలసీ ఏమవుతుంది? ఇప్పటికే చైనాలోని ప్రముఖపారిశ్రామిక ప్రాంతమైన మంచూరియా పూర్తిగా కమ్యూనిస్టుల పరమైవున్నది. ఇతరత్రా పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు చైనాకు రష్యా సహాయం చాలునా? చాలకపోతే బర్మాలోని థాకిన్ నూ వలె మావ్ కూడా రష్యా-అమెరికాల సహాయాన్ని అర్థించగలడా? అప్పుడు